క్లుప్తంగా

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



బిళ్లనందూరు సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ప్రజలకు మెరుగైన సేవలందించాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బిళ్లనందూరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలు, సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామస్తులకు రక్షిత మంచినీటిని అందించాలని సూచించారు. ప్రతి బుధవారం వాటర్ ట్యాంకును శుభ్రం చేయించాలని, మంచినీటి సరఫరాలో లీకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

పశువులకు వ్యాక్సిన్లు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ సూర్యప్రకాశ్

శంఖవరం: గ్రామాల్లో పశువులకు మెరుగైన వైద్యం అందించాలని పశు సంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం స్థానిక పశు వైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో తెల్ల జాతి పశువులకు జబ్బవాపు వచ్చే అవకాశం ఉందని, వెనువెంటనే వ్యాక్సిన్ అందించాలన్నారు. గొర్రెలకు, మేకలకు ఇంటర్ టాక్సోమియా ఎక్కువగా వస్తుందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్లు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ పీతల మనోజ్, మండల పశు వైద్యాధికారి కాకర్ల ప్రసాద్ పాల్గొన్నారు.


స్ఫూర్తిదాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య



ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పట్టణంలో మంగళవారం జరిగింది. సీపీఎం మండల నాయకుడు పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ నేటి యువతకు సుందరయ్య సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. నేటి తరం ఆయన సేవలను మరువరాదన్నారు. పేద ప్రజల కోసం ఆయన సేవలు అజరామరమన్నారు. నిస్వార్థమైన సేవలు అందించిన పుచ్చలపల్లి ఎన్ని తరాలైనా ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లా రాంబాబు, రౌతు సత్యనారాయణ, ముప్పిడి సుశీలమ్మ, రౌతు వెంకటలక్ష్మి, వేమగిరి సంధ్య, బల్ల వెంకటలక్ష్మి, నడిపల్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పని చూపలేదంటూ కూలీల ఆందోళన



ఎంపీడీఓకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఉపాధి కూలీలు

కిర్లంపూడి: తమ జీవనోపాధికి పని కల్పించాలంటూ ఉపాధి హామీ కూలీలు ఆందోళన నిర్వహించారు. మండలంలోని జగపతినగరం, చిల్లంగి గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల పని కల్పించాలని, రూ.300 ఉపాధి కూలీలకు ఇవ్వాలనే నిబంధనను విస్మరిస్తున్నారని చెప్పారు. తమకు రెండు వారాలే పని చెప్పారని, మంగళవారం ఉదయం ఎప్పటిలాగే జగపతినగరం పెద్ద చెరువులో పని చేయడానికి వెళితే.. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పని లేదని చెప్పడంతో నేరుగా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై ఎంపీడీఓ బడే రాజేశ్వరరావును వివరణ కోరగా, ఉపాధి కూలీలకు తగిన కూలి రావడం లేదని, వంద రోజుల పని కల్పించడం లేదని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ జరిపించాలని ఏపీఓకు ఆదేశించామని తెలిపారు. ఏపీఓ కె.నాగమణిని వివరణ కోరగా, జాబ్ కార్డు కలిగి ఉండి, క్షేత్ర స్థాయిలో పని చేసే ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మస్టర్ల రిపోర్టుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

చదువుకు బాటలు

- జూనియర్ కళాశాలల ఏర్పాటుతో విద్యార్థుల్లో ఆనందం
- ఫలించిన విద్యార్థుల ఏళ్ల నాటి నిరీక్షణ
- ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థుల కలల సాకారం



జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన రౌతులపూడి జెడ్పీ హైస్కూల్

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో రౌతులపూడి మండలంలో ములగపూడి, రౌతులపూడిలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలు మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో జూనియర్ కళాశాలలు ప్రారంభానికి ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. దీంతో ఏళ్లనాటి విద్యార్థుల కలలు సాకారమయ్యాయి. మండలం ఏర్పడి 22 ఏళ్లు గడిచినా స్థానికంగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వ కళాశాలలు లేకపోవటంతో. ఏటా పలువురు పేద విద్యార్థులు ఉన్నత విద్యను అందుకోలేకపోయేవారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఆపైన చదువుకునేందుకు స్థానికంగా కళాశాలలు లేకపోవటంతో.. నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యేవారు. పదో తరగతి ఉత్తీర్ణులైన సంపన్న వర్గాల విద్యార్థులు తుని, కాకినాడ వంటి పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ కళాశాలల్లో విద్యను అభ్యసించేవారు.

పెరిగిన విద్యా ప్రమాణాలు

ఇలాఉండగా నాడు–నేడు పథకంలో భాగంగా ప్రతి పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి చేసింది. ఆయా పాఠశాలల విద్యార్థులు హాజరు, ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా ఉన్నత విద్యను ప్రోత్సహించడంతో పాటు, బాలికా అక్షరాస్యతను పెంచడం కోసం ప్రభుత్వం పేద విద్యార్థులకు కోసం అందించిన అమ్మ ఒడి, విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, వసతి దీవెన, జగనన్న గోరు ముద్ద, ట్యాబ్‌ల పంపిణీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు పేద విద్యార్థులకు ఎంతగానో తోడ్పడ్డాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నత విద్యపై ఆసక్తి చూపారు.



ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

ఉన్నత విద్యకు భరోసా

స్థానికంగా ఉన్నత చదువులకు ఎలాంటి సదుపాయం లేక పలువురు పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యేవారు. ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యనందివ్వాలనే ఉద్దేశంతో మారుమూల ప్రాంతాల్లోనూ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసి, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య భరోసా కల్పించారు. రెండేళ్ల క్రితం మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో 40 సీట్ల చొప్పున కేటాయించి, వారందరికీ రెండేళ్లుగా ఇంటర్మీడియెట్ విద్యనందిస్తున్నారు. అదేవిధంగా మండల కేంద్రమైన రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి (కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల) ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం 40 సీట్ల చొప్పున కేటాయించారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులతో ప్రారంభించారు.

ఉపాధ్యాయ బృందాలు ఇంటింటి ప్రచారం

మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను అందించేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోళ్ల రాంబాబు, చిట్టియ్య ఆధ్వర్యంలో వారి సిబ్బందితో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రాల ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ఫీజులు భారం ఉండదని, అనుభవజ్ఞులైన పీజీటీ అధ్యాపక బృందంతో విద్యా బోధన, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, స్మార్ట్ తరగతి గదులు, అటల్ ల్యాబ్, వ్యక్తిత్వ వికాస శిక్షణ, విలువలతో కూడిన విద్యను అందివ్వటమే లక్ష్యంగా మండల గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రచారం చేపట్టారు.

కళాశాల ఏర్పాటు శుభసూచకం



మండల కేంద్రమైన రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాను. పై చదువు కోసం ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదివే ఆర్థికస్తోమత లేక, చదువును ఆపేయాల్సిన పరిస్థితుల్లో మా కుటుంబం ఉంది. ఈ ఏడాది రౌతులపూడిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయటంతో నేను ఇంటర్మీడియెట్ చదివే అవకాశం దక్కింది. స్థానికంగా జూనియర్ కళాశాల ఏర్పాటు మాలాంటి వాళ్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– దార్లపూడి భార్గవి, విద్యార్థిని ఎస్.పైడిపాల

అన్ని ఏర్పాట్లూ చేశాం



ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని ములగపూడిలో మహిళా జూనియర్ కళాశాల, రౌతులపూడిలో ఈ ఏడాది నుంచి ప్రారంభమైన కో–ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. తరగతి గదులు, ల్యాబ్, స్మార్ట్ తరగతి గదులు, అటల్ ల్యాబ్, ఆట స్థలం వంటివి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు సమకూర్చాం. పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఒక్కొక్క కోర్సుకు 40 సీట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

– గాది కొండబాబు, ఎంఈఓ–2, రౌతులపూడి మండలం

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఏబీవీ ప్రసాద్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, నీతికథలు పాటలు, సాహిత్యంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. నేటి సమాజంలో ఇంగ్లిష్ భాషకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. విద్యార్థులు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరు కావాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోట గిరిజన గ్రామ పంచాయతీలోని ఉలిగోగుల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ కోరారు. మంగళవారం ఆయన పార్టీ నేతలతో కలిసి గ్రామంలో పర్యటించారు. కొద్ది రోజులుగా తాగునీటికి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

మళ్లీ జగన్ పాలన ఖాయం



వీరవరంలో తోట నరసింహాన్ని కలిసిన పార్టీ శ్రేణులు

- గతానికంటే మెరుగైన సీట్లు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల వద్ద తోట ధీమా

కిర్లంపూడి: ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా.. రాష్ట్రంలో గతం కన్నా మెరుగైన సీట్లతో మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని, జగ్గంపేటలో భారీ మెజార్టీతో గెలిచేది తానేనని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని నీలాద్రిపేట, రాజపూడి, ఎస్.తిమ్మాపురంతో పాటు, పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం భారీ సంఖ్యలో వీరవరంలోని తోట నరసింహంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓట్ల వివరాలు, వైఎస్సార్ సీపీకి వచ్చే మెజార్టీపై కార్యకర్తలతో కూలంకషంగా చర్చించారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు తోట నరసింహం కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలు వంద శాతం పేదలకు అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, నాయకులు ఐఆర్ గోపి, కర్ణం సత్తిబాబు, అత్తులూరి సాయిబాబు, టి.అర్జున్ తదితరులు ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి

పార్టీల నేతలతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

జగ్గంపేట: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జగ్గంపేటలోని శివపార్వతి కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. అదే తరహాలో కౌంటింగ్ ప్రక్రియకు కూడా సహకరించాలని కోరారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. అల్లర్లకు, హింసాత్మక సంఘటనలకు పాల్పడరాదని తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన వారు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ, విజయోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు, ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రా, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై నాగార్జునరాజు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో జరిగిన సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు



జగ్గంపేట సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

ప్రత్తిపాడు: చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఇందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రత్తిపాడు సరయు కన్వెన్షన్ హాల్ ఆవరణలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఇదే సహకారాన్ని అందించాలని కోరారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే చర్యలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం సతీష్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి ఎస్సైలు ఎం పవన్‌కుమార్, సతీష్, కిషోర్, నబీతో పాటు, వైఎస్సార్ సీపీ నాయకులు వరుపుల సూరిబాబు, బెహరా దొరబాబు, పైలా బోస్, వాసిరెడ్డి భాస్కరరావు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



భక్తులతో కలసి పల్లకీ సేవలో పాల్గొన్న మంత్రి రాజా భార్య లక్ష్మీచైతన్య

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిత్య పూజలు, కైంకర్యాలు, సుదర్శన హోమం, పూర్ణాహుతి, అన్నమాచార్య సంకీర్తనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా భార్య లక్ష్మీచైతన్య, పలువురు భక్తులు ఉత్సవ మూర్తుల పల్లకీ సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

నేటి కార్యక్రమాలు: శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం శ్రీలక్ష్మీ నారసింహ హోమం, గరుడ వాహన సేవ, మృగోత్సవం, రామాలయం వరకు తిరువీధి, దొంగల దోపోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్థిక వనరుల పెంపుపై శిక్షణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఆర్థిక వనరుల పెంపుపై సహకార సంఘాల సీఈఓలకు వచ్చే నెలలో శిక్షణ నిర్వహిస్తున్నారు. శిక్షణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సహకార సంఘాల ఆర్థిక సమృద్ధిలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సొసైటీల ఆర్థిక వనరులను పెంచేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. దీనికోసం రూపొందించిన పోర్టల్‌పై వచ్చే మూడు నెలల్లో శిక్షణలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా అష్టోత్తర శతనామావళి

ప్రత్తిపాడు రూరల్: ఉత్తరకంచిలో మంగళవారం అభయ ఆంజనేయ స్వామివారికి పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అన్న సమారాధన

గండేపల్లి: మల్లేపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం భారీ అన్న సమారాదన జరిగింది. ఎస్సై ఎస్ రామకృష్ణ, అడిషనల్ ఎస్సై టి.వెంకటేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాజీ ప్రధాని రాజీవ్ వర్ధంతి

ప్రత్తిపాడు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ, ఆర్థిక పరిపుష్టికి, స్వాతంత్ర్య సాధనకు గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మూరా నాగేంద్ర, కందిమళ్ల సామ్యేలు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

పొన్నచెట్టు వాహనంపై సత్యదేవుని ఊరేగింపు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో నాలుగో రోజు వైశాఖ శుద్ధ త్రయోదశి, మంగళ వారం రాత్రి శ్రీసత్యదేవుడు, అమ్మవారిని పొన్నచెట్టు వాహనంపై ఘనంగా ఊరేగించారు. రాత్రి తొమ్మిది గంటలకు శ్రీసత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండదిగువన తొలిపాంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన పొన్నచెట్టు వాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. అనంతరం పొన్నచెట్టు వాహనం ముందు కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. శ్రీసత్యదేవుని తొలిపావంచా వద్ద నుంచి ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకూ, అక్కడి నుంచి మరలా తొలిపావంచా వరకూ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు.



పొన్నచెట్టు వాహనంపై ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

పోలీసుల ఆకస్మిక తనిఖీలు



జగ్గంపేట నెహ్రూ కాలనీలో స్వాధీనం చేసుకున్న రికార్డుల్లేని మోటార్ సైకిళ్లు



తుని రాజీవ్ గృహకల్పలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పట్టణ సీఐ గీతారామకృష్ణ, ఎస్సైలు

కార్డన్ అండ్ సెర్చ్‌లో భారీగా వాహనాల స్వాధీనం

తుని రూరల్: తుని పట్టణంలోని రాజీవ్ గృహకల్పలో టౌన్ సర్కిల్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (సామూహిక ఆకస్మిక తనిఖీలు) నిర్వహించారు. అనుమానిత, రికార్డులు లేని 27 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాలు, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ గీతారామకృష్ణ, ఎస్సైలు రామలింగేశ్వరరావు, విజయబాబు, వినయ్ ప్రతాప్, పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గీతారామకృష్ణ మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. పట్టణ ప్రజలు, యువత ఎటువంటి అల్లర్లు, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనవద్దని, యువత మత్తు పదార్థాలకు లోను కావద్దని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి రికార్డులు చూపించి వాహనాలను పొందవచ్చన్నారు.

నెహ్రూ కాలనీలో..

జగ్గంపేట: పోలీసులు స్థానిక నెహ్రూకాలనీలో మంగళవారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచి నాలుగు గంటల పాటు ఇంటింటా ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని 27 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనలకు తోడు, జ్యోతుల కాలనీలో మద్యం, గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్టు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ముగ్గురు ఎస్సైలు, 30 మంది కానిస్టేబుళ్లు మొత్తం నెహ్రూ కాలనీలోని పది వీధులను జల్లెడ పట్టారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, అర్ధరాత్రి సమయంలో వీధుల్లో తిరిగినా, అనుమానాస్పదంగా కనిపించినా సమాచారం అందించాలని సీఐ లక్ష్మణరావు కోరారు. నెహ్రూ కాలనీలో గంజాయి ముఠాలు ఉన్నట్టు సమాచారం ఉందని, దీనిపై నిఘా పెట్టామన్నారు. కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. నెహ్రూ కాలనీలో తరచూ తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తంటికొండ వెంకన్న

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణోత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి నిత్యోపాసన, బలిహరణ, సాయంత్రం పండిత సభ, విశేషార్చనలు నిర్వహించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి

జగ్గంపేట: ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించడానికి ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని జగ్గంపేట టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలన్నారు.